క్లుప్తంగా

నేడు వాహనాల వేలం

వీరఘట్టం: మద్యం కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను శనివారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఎస్.ఐ జి.కళాధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆటో, స్కూటీ, టీవీఎస్ మోపెడ్, హీరో ప్యాషన్ బైక్‌ను వేలం వేలయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు తమ ఆధార్ కార్డు పట్టుకుని వేలంలో పాల్గొనవలసినదిగా కోరారు.

మజ్జిగౌరమ్మగా.. మహాశివుడు



పాలకొండ రూరల్: భక్తులు తలచే రూపంలోనే భగవంతుని దర్శనం లభిస్తుందని అర్చకులు పర్రి శరత్‌కుమార్ అన్నారు. స్థానిక నక్కలపేట మృత్యుంజయ మరకత మహాశివలింగానిన్నే రాయిగడ మజ్జిగౌరమ్మగా అలంకిరంచిన తీరు భక్తులను ఆధ్యాత్మిక పరవశానికి గురిచేసింది. అద్భుతమైన ఈ అలంకరణలో శివపార్వతులను దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. శుక్రవారం గౌరీ అలంకరణదారి అయిన మృత్యుంజయునికి అఖండ దీప, హారతితో అర్చనలు చేశారు. ఈ ఆధ్యాత్మిక ఘట్టంలో భాగస్వాములైన భక్తులు తన్మయానికి గురయ్యారు.

పామాయిల్ పరిశ్రమ సందర్శన

గుమ్మలక్ష్మీపురం: కురుపాం మండల రావాడ రామభద్రాపురంలో ఉన్న పామాయిల్ ఫ్యాక్టరీని ఇండస్ట్రియల్ ఎక్స్‌ప్లోజర్‌లో భాగంగా గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు విద్యార్థులు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పామాయిల్ ముడి సరుకుతో ఆయిల్‌ను ఎలా తయారు చేస్తారు, అమ్మకం, లాభ నష్టాలు, ఎంత మందికి ఉపాధి లభిస్తుంది, ముడిసరుకు ఎంత మేరకు లభ్యమవుతోంది, మార్కెట్ విలువ, తదితర అంశాలను అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకుని నోట్ చేసుకున్నారు. విద్యార్థులు స్వయం ఉపాధి, వ్యాపార రంగంలో మెలకువలు తెలుసుకునేందుకు ఈ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని అధ్యాపకులు అన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలని నిరసన

సీతంపేట: విద్యుత్ చార్జీలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్లు, ట్రూ ఆఫ్ చార్జీలు వద్దంటూ స్థానిక ట్రాన్స్‌కో కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో విద్యుత్ వినియోగదారులు శుక్రవారం నిరసన తెలియజేశారు. ముందుగా సీపీఎం కార్యాలయం నుంచి విద్యుత్‌శాఖ ఆఫీస్‌కు ర్యాలీగా తరలివెళ్లారు. అక్కడ కొద్దిసేపు నిరసన తెలియజేశారు. అనంతరం విద్యుత్‌శాఖ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎ.భాస్కరరావు, పి.సాంబయ్య, జె.సుందరమ్మ, ఎ.గంగాధర్, బి.నీలయ్య, జి.మధుసూదన్, తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల గౌరవ వందనం

పాలకొండ రూరల్: మండలంలోని గొట్ట మంగళాపురం గ్రామానికి చెందిన కోట్ల బుల్లిబాబు (48) ఎల్విన్‌పేట పోలీస్ స్టేషన్‌లో హోం గార్డుగా విధులు నిర్వహిస్తున్నారు. గురువారం విధులకు హాజరయ్యేందుకు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా కురుపాం మండలం జరడ నుంచి నీలకంఠాపురం మధ్య గల ఘాట్‌రోడ్డులో వాహనం అదుపుతప్పి ప్రమాదాని గురై మరణించాడు. ఆయన మృతదేహాన్ని స్వగ్రామానికి శుక్రవారం తరలించారు. గ్రామస్తుల అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు చేపట్టారు. పోలీసులు గాలిలో మూడు రౌండ్లు కాల్పులు జరిపి గౌరవ వందనం సమర్పించారు.

యోగాతో ఒత్తిడి దూరం

పాలకొండ రూరల్: విధి నిర్వహణలో ఒత్తిడికి గురికావటంతో ఆ ప్రభావం పనిపై పడుతుందని మానసిక ఆరోగ్యం కార్యక్రమం జిల్లా నిర్వాహకుడు, సామాజిక వేత్త కె.కృష్ణారావు అన్నారు. స్థానిక పంచాయతీరాజ్ కార్యాలయంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మానసిక ఒత్తిడిని అధిగమించేందుకు అనుసరించాల్సిన మెళకువలను వివరించారు. క్రమం తప్పకుండా చేయాల్సిన యోగాసనాలపై అవగాహన కల్పించారు. క్షణికావేశంలో తీసుకుంటున్న నిర్ణయాల కారణంగా జీవితాలు అర్థాంతరంగా ముగిసిపోతాయని, ఆయా కుటుంబాల్లో ఈ నిర్ణయాలు చీకట్లు నింపుతాయని వివరించారు. విజ్ఞతతో ఆలోచించి ఉత్తమ మార్గంలో నడవాలని సూచించారు. పీఆర్ జేఈఈలు కాంతారావు, కీర్తన, డీఏఓ మోహనరావు, ఏవీ రమణ, సహాయకులు రామ్‌జీ, సిబ్బంది పాల్గొన్నారు.

12 అడుగుల కింగ్‌కోబ్రా హతం

పాలకొండ: మండలంలోని జంపరకోట పంచాయతీ పరిధి వెంకటరాయునివలస సమీపంలో జంపరకోట రిజర్వాయర్ వద్ద 12 అడుగుల కింగ్‌కోబ్రా జాతి పామును స్థానికులు గుర్తించారు. గిరిజనులు పొలం పనుల్లో ఉండగా సమీపంలోని పామాయిల్ తోటలో ఈ పామును గుర్తించారు. భయాందోళనకు గురై కర్రలతో దాన్ని హతమార్చారు.

మత్తుపదార్థాల జోలికి పోవద్దు

జియ్యమ్మవలస: మండలంలోని బీజేపురం ఉన్నత పాఠశాలలో 9,10 తరగతి విద్యార్థులకు ఎంఈఓ-2 ఎం.శ్రీనివాసరావు యాంటీ డ్రగ్స్‌పై శుక్రవారం అవగాహన కల్పించారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించచారు. విద్యార్థులు ఎట్టి పరిస్థితుల్లోనూ మత్తుపదార్థాల జోలికి పోరాదని, బాగా చదువుకుని జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

మధ్యాహ్న భోజన నిర్వహణకు

రాజకీయ గ్రహణం



పాలకొండ మండలం తుమరాడ ఎంపీపీ పాఠశాలలో భోజనాలు చేస్తున్న విద్యార్థులు

- కూటమి ప్రభుత్వం వచ్చాక అనేక పాఠశాలల్లో పాతవారికి ఉద్వాసన
- ఏళ్లతరబడి'ని నమ్ముకున్నవారిపై వేధింపులు
- నిర్వహణలోనూ లోటుపాట్లు

పాలకొండ రూరల్/భామిని/సీతంపేట/వీరఘట్టం:

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విద్యాశాఖలో ఎటువంటి పురోగతి కనిపించం లేదు. ప్రభుత్వ బడుల అభివృద్ధికి, విద్యారంగ సంక్షేమ పథకాల అమలుకు ఇంతవరకు ఎలాంటి చర్యలు లేవు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాడు-నేడు ద్వారా పాఠశాలలను అభివృద్ధి చేసింది. విద్యార్థులకు సకాలంలో విద్యాసామగ్రి అందించడంతో పాటు అమ్మఒడి నిధులను తల్లుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసేది. ఈ ప్రభుత్వం వచ్చి నాలుగు నెలలవుతున్నా ఎలాంటి పురోగతి లేదని విద్యార్థుల తల్లితండ్రులు విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం మధ్యాహ్న భోజన తీరుతెన్నులపై సాక్షి క్షేత్రపరిశీలన చేపట్టింది.

రాజకీయ కక్షతో..

ఏళ్ల తరబడి మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను నమ్ముకున్న చిరుఉద్యోగులపై నూతన విద్యా కమిటీల వేధింపులు బయటపడుతున్నాయి. పాలకొండ మండలం తపంపటాపల్లి ప్రభుత్వ పాఠశాలలో దశాబ్దాలుగా వంటపని చేస్తున్న అల్లి లక్ష్మి, మురపాక దేశాలమ్మను ఎటువంటి కారణం లేకుండా విధుల నుంచి తొలగించారని వారు వాపోయారు. అలాగే అన్నవరం ప్రభుత్వ పాఠశాలతో పాటు తుమరాడ పాఠశాలలో ఎండీఎం పథకం నిర్వహణను కొత్తవారికి అప్పగించారు. ఇదే రీతిన భామిని మండల పరిధిలో 12 పాఠశాల్లో కమిటీల సూచనలతో కొత్తవారికి వంట నిర్వహకులుగా అవకాశం ఇవ్వటంతో పాతవారు లబోదిబో మంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వంట నిర్వాహకులకు రాజకీయ గ్రహణం పట్టిందని తొలగింపునకు గురైనవారంతా వాపోయారు. మరోవైపు గడిచిన రెండు నెలులుగా భోజన నిర్వహణ బిల్లుల చెల్లింపులో జాప్యం కారణంగా నిర్వాహకులు అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా గ్యాస్ కనెక్షన్లు అందుబాటులో ఉన్నా కొంతమంది కట్టెల పొయ్యిలపై ఆధారపడుతున్నారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనంలో నాణ్యత కనిపించడం లేదు. పాలకొండ మండలం ఎం.సింగుపురం జెడ్పీ ఉన్న పాఠశాలలో, వీరఘట్టం మండలం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్ల నిర్వహకులు తమ వ్యక్తిగత కారణాలతో విధులకు దూరమయ్యారు. సీతంపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాలురకు సంబంధించి ఆరు మరుగు దొడ్లు నిర్మాణదశలో నిలిచిపోవటంతో అక్కడి విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.

నియోజకవర్గంలో..	
మొత్తం ప్రభుత్వ పాఠశాలలు	365
చదువుతున్న విద్యార్థులు	21,445
వంట నిర్వాహకుల సంఖ్య:	811
మధ్యాహ్న భోజన నిర్వాహకులను మార్పు చేసిన పాఠశాలలు	15
మరుగుదొడ్ల నిర్వహణకు సిబ్బంది లేని పాఠశాలలు	2



సీతంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అర్థాంతరంగా నిలిచిన మరుగు దొడ్ల నిర్మాణం

పాలకొండ పట్టణంలోని పెద్దకాపువీధి జెడ్పీ ఉన్నత పాఠశాలలో కట్టెల పొయ్యిపై వంట నిర్వహణ



కలెక్టర్ గ్రీవెన్స్‌లో విన్నవించినా..



దశాబ్దాలుగా వంటనిర్వాహకులగా పనిచేస్తున్నాం. మా పనితీరుపై విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి ఎటువంటి ఫిర్యాదులు లేవు. కేవలం రాజకీయ కక్షతో నూతన విద్యా కమిటీ సూచనలతో మమ్మల్ని విధుల నుంచి తొలగించారు. మా సమస్యను గ్రీవెన్స్‌లో కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లాం. పరిశీలిస్తామన్నారు. దాదాపు రెండు వారాలు గడిచిపోయావి. ఎటువంటి చర్యలు లేవు. కొత్తవారు విధుల్లో చేరారు. మావంటి చిరు ఉద్యోగులపై వేధింపులు తగవు. ఎంత బతిమిలాడినా పట్టించుకోలేదు. ఏళ్ల తరబడి పిల్లలకు వండి పెడుతున్న మమ్మల్ని నిష్కారణంగా తొలగించటాన్ని తట్టుకోలేకపోతున్నాం.

– అల్లి లక్ష్మి, మురపాక దేశాలమ్మ, మాజీ వంట నిర్వాహకులు, ఎంపీపీ పాఠశాల, తంపటాపల్లి, పాలకొండ మండలం

రైతుల అవస్థలపై స్పందించాలి

- ఏపీ రైతు సంఘం డిమాండ్



నీరు లేక ఎండిపోతున్న వరి పంటను పరిశీలిస్తున్న రైతు నాయకులు

పాలకొండ రూరల్: ప్రస్తుత కీలక దశలో వరి పంటకు సాగునీరు అందక రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నట్లు ఏపీరైతు సంఘం జిల్లా కార్యదర్శి బుడితి అప్పలనాయుడు అన్నారు. శుక్రవారం రైతులతో కలిసి టైలాండ్ గ్రామాల్లో క్షేత్రపర్యటన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తోటపల్లి కాలువల్లో గల ఓపెన్‌హెడ్ ఛానల్స్ పూర్తిగా మరమ్మతులకు గురికావటం, అధికారుల నిర్లక్ష్యం కారణంగా సకాలంలో పంటకు నీటితడులు అందక రైతులు నష్టపోతున్నారన్నారు. ఎగువ ప్రాంత రైతులు సాగునీటి ప్రవాహానికి అడ్డుకట్టలు వేస్తున్నా యంత్రాంగం స్పందించక పోవటంతో సమస్యలు తలెత్తున్నాయన్నారు. ముఖ్యంగా ఓపెన్‌హెడ్ ఛానల్స్ అందుబాటులోకి తీసుకురావాలని, పాలకొండ మండల పరిధిలో ఓని గెడ్డకు వంశధార నీటిని, ఛానల్స్‌ను అనుసంధానం చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక ప్రజా ప్రతినిధులు రైతుల తరపున సంబంధిత అధికారులతో చర్చలు జరపాలని కోరారు.

మొక్కజొన్న రైతుల కష్టాలు



పసుకుడి వద్ద టార్పాలిన్లు కప్పిన మొక్కజొన్న కుప్పలు

భామిని: మండలంలో వరుస వర్షాలతో మొక్కజొన్న రైతులు నష్టపోతున్నారు. చేతికందిన పంటను కాపాడుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారు. శుక్రవారం వాన జల్లులు కురవడంతో ఆరబెట్టిన మొక్కజొన్న గింజలను కుప్పలుగా పోయలేక, టార్పాలిన్లు కప్పి రక్షించుకునేందుకు అవస్థలు పడ్డారు. గత వారం రోజులుగా మండలంలో మొక్కజొన్న కోతలు, నూర్పులు జరుగుతున్నాయి. గింజల్లో తేమ శాతం తగ్గించడానికి రైతులు పంటను ఆరబెడుతున్న తరుణంలో వరుస వర్షాలు ఇబ్బందులు పెడుతున్నాయని రైతులు వాపోతున్నారు.

ముస్లిం మహిళలకు చీరల పంపిణీ



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న సిరాజుద్దీన్

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): విశాఖపట్నంకు చెందిన మోసెస్ వెల్ఫేర్ సొసైటీ సహకారంతో యస్ సొసైటీ ఆధ్వర్యంలో కురుపాం మండల కేంద్రంలోని నిరుపేద ముస్లిం మహిళలకు చీరలు, పవిత్ర ఖురాన్ పుస్తకాలను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మోసెస్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధి సిరాజుద్దీన్ మాట్లాడుతూ పవిత్ర ఖురాన్ చదివి, అందులోని అంశాలను పాటించడం ప్రతి ముస్లిం కర్తవ్యమని చెప్పారు. రానున్న రోజుల్లో కూడా పేద ముస్లింల అభ్యున్నతికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో యస్ సొసైటీ కార్యదర్శి షేక్ గౌష్ పాల్గొన్నారు.

హామీలు అమలు చేయకుండా ఆర్భాటపు ప్రచారమేల?

- మాజీ ఎమ్మెల్యే కళావతి



వీరఘట్టం: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా పాలకొండ నియోజకవర్గంలో తాము గుర్తించిన పనులనే తాజాగా కూటమి నాయకులు గుర్తించి అభివృద్ధి చేస్తున్నట్లు ఉత్తుత్తి ప్రచారాలు చేసుకుంటున్నారని మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి విమర్శించారు. వండువలో శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడారు. ఎంతసేపు ఇసుక దోపిడీ చేయడమే పనిగా పెట్టుకున్న కూటమి నాయకులు పాలనపై దృష్టి సారించడం లేదన్నారు. గత వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రభుత్వ మద్యం విధానంలో సుమారు 12 వేల మంది యువతకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉపాధి కల్పిస్తే, కూటమి ప్రభుత్వం ప్రైవేటు మద్యం విధానంతో వారికి ఉపాధి లేకుండా చేసి రోడ్డున పడేసిందన్నారు. అస్మదీయులకు మద్యం షాపులను కట్టబెట్టి ఊరూరా మద్యంను ఏరులై పారించి ప్రజల ఆరోగ్యంతో కూటమి నాయకులు చెలగాటమాడుతున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం చేస్తున్నది అరాచక పాలన, ప్రజలకు ఒక్క సంక్షేమ పథకం కూడా అందడం లేదు. మోసం, దగా, దోపిడీయే అజెండాగా కూటమి పాలన ఉందని దుయ్యబట్టారు. ఈ ప్రభుత్వానికి మద్యం అమ్మకాలపై ఉన్న దృష్టి ప్రజా సంక్షేమంపై లేదన్నారు. తక్షణమే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేదంటే ప్రజలే మీకు బుద్ధి చెపుతారని కళావతి అన్నారు.

పల్లె పండుగతో గ్రామాల్లో మౌలిక వసతులు



భామిని: ఎమ్మెల్యే జయకృష్ణకు స్వాగతం పలుకుతున్న అధికారులు, కార్యకర్తలు



గుమ్మలక్ష్మీపురం: గుమ్మలో అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎంపీడీఓ ఉమామహేశ్వరి

భామిని: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన 'పల్లె పండుగ'తో గ్రామాల్లో మరుగునపడిన సమస్యలు పరిష్కారానికి నోచుకుంటున్నాయని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. మండలంలోని బత్తిలి, లివిరి, చిన్నదిమిలి, తాలాడలో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో మంజూరైన దేవాలయాలకు రోడ్డు నిర్మాణ పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు ప్రజా సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఈఈ కె.సింహాచలం, ఏఈ సత్యనారాయణమూర్తి, ఎంపీడీఓ చంద్రరావు, ఏపీఓ తులసీదాస్, టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు బి.రవినాయుడు, ఎం.జగదీశ్వరరావు, మాజీ జెడ్పీటీసీ సోమరాజు, గోపాలరావు, నిమ్మల నిబ్బరం, తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలో..

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు ఎంపీడీఓ జే ఉమామహేశ్వరి అన్నారు. మండలంలోని గుమ్మ గ్రామంలో శుక్రవారం పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా రూఫ్ టాప్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ నిర్మాణ పనులను సర్పంచ్ బిడ్డిక గోపాల్, గ్రామ పెద్దలు వెంపటాపు భారతి తదితరులతో కలిసి ప్రారంభించారు. నిర్మాణ పనులు సకాలంలో పూర్తిచేయాలని సూచించారు. ఆమె వెంట ఈఓపీఆర్డీ రమేష్, ఏపీఓ బావాజీరావు, సచివాలయం సిబ్బంది ఉన్నారు.

పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించాలి



ఆశ్రమంలో వృద్ధులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి కృష్ణసాయితేజ

పాలకొండ రూరల్: వృద్ధులు, చిన్నారుల కోసం ఆశ్రమాలు, వసతి గృహాలు నిర్వహిస్తున్నవారు పూర్తిసౌకర్యాలు అందుబాటులో ఉండేలా చూడాలని పాలకొండ జూనియర్ సివిల్ కోర్టు ఇన్‌చార్జీ న్యాయమూర్తి సీఎస్‌వీబీ కృష్ణసాయితేజ అన్నారు. సుప్రీం కోర్టు ఆదేశాలతో మండల పరిధిలో ఆశ్రమాలను శుక్రవారం తనిఖీ చేశారు. పట్టణంలోని బాలగోపాల లక్ష్మీనరసమ్మ ఓల్డేజీ హోంను సందర్శించి అందులో ఉన్న వసతులను పరిశీలించారు. అక్కడ ఆశ్రయం పొందుతున్న వృద్ధుల క్షేమ సమాచారంతో పాటు వారి సాదకబాదకాలను అడిగి తెలుసుకున్నారు. ఆశ్రమంలో ఉన్న వనరులు, సౌకర్యాలపై ఆరా తీశారు. పలువురు వృద్ధులు దోమతెరలు అందించాలని న్యాయమూర్తిని కోరటంతో ఆయన సానుకూలంగా స్పందించారు. ఆయన వెంట న్యాయవాదులు, బార్ అసోసియేషన్ సభ్యులు, హోమ్ నిర్వాహకులు ఉన్నారు.

టీకేజమ్ములో వైద్య శిబిరం

జియ్యమ్మవలస: మండలంలోని టీకేజమ్ము గ్రామంలో శుక్రవారం బిగ్ టీవీ ఆధ్వర్యంలో రూట్స్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో జెమ్స్ ఆస్పత్రి సౌజన్యంతో మెగా వైద్యశిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రూట్స్ స్వచ్ఛంద సంస్థ కార్యదర్శులు ఎ.వినోద్‌కుమార్, ఎస్.సోనియా మాట్లాడుతూ మారుమూల గిరిజన ప్రాంతాల్లో మరిన్ని ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించేందుకు తమ వంతు కృషిచేస్తామన్నారు. శిబిరం నిర్వాహకులకు స్థానిక సర్పంచ్ అడ్డాకుల భారతి, గ్రామ పెద్దలు ధన్యవాదాలు తెలియజేశారు.

పంటకోత ప్రయోగాలతో దిగుబడి లెక్కింపు

భామిని: మండల రైతు సేవా కేంద్రంలో శుక్రవారం వ్యవసాయ సహాయకులకు పంట కోత ప్రయోగాల నిర్వహణపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ నీలాపు అప్పారావు, మండల వ్యవసాయాధికారి కె.సింహాచలం మాట్లాడుతూ.. ఎంపిక చేసిన పంట పొలాల్లో నిర్దిష్ట పరిమాణంలో పంటకోత ప్రయోగాలు చేపట్టడం ద్వారా దిగుబడిని అంచనా వేయవచ్చన్నారు. పంటకోత ప్రయోగాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పంటకోత ప్రయోగాల వల్ల కలిగే ప్రయోజనాలను డీఎస్‌ఓ, ఏఏస్‌ఓలు వివరించారు. కౌలు రైతులకు పంట రుణాల మంజూరుపై సూచనలు చేశారు.

సాగునీరు అందించాలని వినతి



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న రైతులు, నాయకులు

పాలకొండ రూరల్: ఖరీఫ్ ప్రారంభం నుంచి పాలకొండ మండలంలోని శివారు ప్రాంతాలకు సాగునీరు లేక రైతులు అవస్థలు పడుతున్నట్లు అభ్యుదయ రైతు కండాపు ప్రసాదరావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ప్రస్తుతం వరి కీలక దశలో ఉందని, ఈ సమయంలో నీటి తడులు లేక భూమి బీటలు వారిందని వాపోయారు. సాగునీరు అందించాలని జలవనరుల శాఖకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేదన్నారు. తాజాగా పీఆర్ రాజుపేటకు చెందిన రైతులు తోటపల్లి ప్రధాన కాలువపై పనులుచేసి పూడిక తీతలు, ఎగువ ప్రాంత రైతులు వేసిన అడ్డుకట్టలు తొలగించటం జరిగిందన్నారు. అయినా సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారని, అధికారులు చొరవ తీసుకుని సాగునీరు అందించకుంటే వేలాది ఎకరాల్లో పంట నష్టం తప్పదని సబ్ కలెక్టర్‌కు వివరించారు. నేరడిబిల్లి ప్రసాద్, కె.క్రాషరావు తదితరులు సబ్ కలక్టర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

ఆరోపణలపై డ్వామా పీడీ విచారణ



మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బందిని ప్రశ్నిస్తున్న డ్వామా పీడీ రామచంద్రరావు

గరుగుబిల్లి: గరుగుబిల్లి ఎంపీడీఓపై వచ్చిన ఆరోపణలు రుజువైతే శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా డ్వామా పీడీ కె.రామచంద్రరావు అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంపీడీఓ పైడితల్లిపై వచ్చిన ఆరోపణలపై శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో విచారణ నిర్వహించారు. ముందస్తుగా సమాచారం అందించినప్పటికీ విచారణ సమయంలో ఎంపీడీఓ లేకపోగా, ఆ విషయాన్ని దిగువస్థాయి సిబ్బందికి తెలియపరచకపోవడంతో పీడీ అసహనం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారవేదికలో మరుగుదొడ్ల నిర్మాణంపై, జనరల్ ఫండ్ వినియోగం, బోరు మెకానిక్ నియామకం, వాహనాల అద్దె చెల్లింపులలో పలు అక్రమాలకు పాల్పడినట్లు ఎంపీడీఓపై కలెక్టర్‌కు ఫిర్యాదులు అందాయన్నారు. దీనిపై విచారణ నిర్వహించేందుకు వచ్చిన సమయంలో ఎంపీడీఓ అందుబాటులో లేకపోవడం బాధ్యతా రాహిత్యమే అని అన్నారు. సిబ్బంది రవి, రామచంద్రప్రసాద్ నుంచి కొంతమేర సమాచారాన్ని తీసుకొని మండల పరిషత్‌కు సంబంధించిన రికార్డులను స్వాధీనం పరుచుకున్నారు.

కేవీకేలో వ్యవసాయ విజ్ఞానం



కేవీకే సేవలను విద్యార్థులకు వివరిస్తున్న శాస్త్రవేత్త అనంత విహారి

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కృషి విజ్ఞాన కేంద్రంలో వివిధ పంటల సాగులో రైతులకు కావాల్సిన వ్యవసాయ విజ్ఞానం లభిస్తుందని కురుపాం మండలం రస్తాకుంటుబాయి కృషీ విజ్ఞాన కేంద్రం (ఆచార్యా ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం) విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.అనంత విహారి అన్నారు. ఈమేరకు గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ పథకంలో భాగంగా 20 మంది విద్యార్థులు శుక్రవారం కేవీకేను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు కేవీకే ద్వారా అందుతున్న సేవలను వివరించారు. అలాగే కేవీకేలో ఉన్న వివిధ డెమో యూనిట్లు, వర్మీకంపోస్టు యూనిట్లు, పుట్టగొడుగుల యూనిట్, ఫౌల్ట్రి షెడ్, చిరుధాన్యాలు యూనిట్‌లను చూపించారు.

గిరిశిఖర గ్రామాల్లోవలంటీర్లే ఉపాధ్యాయులు



బిన్నిడి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పాఠాలు చెపుతున్న వలంటీర్లు

కొమరాడ: మండలంలోని ఏజెన్సీ గ్రామల్లో ఉపాధ్యాయాలు సమయపాలన పాటించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. గుణదతీలేస్ పంచాయతీ గిరిశిఖర గ్రామం బిన్నడి పాఠశాలలో సుమారు 35 మంది విద్యార్థులు ఉన్నారు. పక్కా భవనం లేకపోవడంతో పాటు ఉపాధ్యాయులు సక్రమంగా రావడం లేదని, దీని వల్ల పిల్లలు చదువుకు దూరమవుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయాలు ఉన్నప్పటికీ నెలలో ఒక్కరోజు కూడా రావడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామస్తులు తమ సొంత నిధులతో వలంటీర్లను నియమించుకున్నారు. వేలాది రూపాయాలు జీతాలు తీసుకుంటున్న ఉపాధ్యాయాలు తమ గ్రామానికి ఎందుకు రావడం లేదని విద్యార్థులు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఇక్కడే కాకుండా మండలంలోని చాలా గిరిశిఖర గ్రామాల్లో ఇదే పరిస్థితి ఉందని ప్రజా సంఘ నాయకులు చెపుతున్నారు. దీనిపై మండల విద్యాశాఖాధికారి జామి నారాయణస్వామిని వివరణ కోరగా అలా జరగడం లేదని, దీనిపై కచ్చితంగా పర్యవేక్షణ చేస్తామని చెప్పారు.

అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు: జేసీ



సమీక్ష నిర్వహిస్తున్న జేసీ శోభిత

పాలకొండ: రీసర్వేకు సంబంధించిన విధుల నిర్వహణలో అలసత్వం వహించే సిబ్బందిపై చర్యలు తప్పవని జేసీ ఎస్ఎస్ శోభిత హెచ్చరించారు. కోట దుర్గమ్మ కళ్యాణ మండపం ఆవరణలో శుక్రవారం పాలకొండ రెవెన్యూ డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, మండల సర్వేయర్లు, విలేజ్ సర్వేయర్‌లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల వారీగా భూముల సర్వేపై ఆరా తీశారు. ప్రతీ గ్రామంలో రీసర్వేపై ముందుగా రైతులకు సమాచారం అందించాలని, గ్రామసభలు ఏర్పాటు చేసి రైతుల నుంచి ఫిర్యాదులు తీసుకోవాలని సూచించారు. రైతుల నుంచి వచ్చిన అభ్యంతరాలను నమోదు చేసుకోని వాటిని సరిచేయాలని తెలిపారు. ఆమెతో పాటు సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్ రెడ్డి, జిల్లా సర్వే అధికారి లక్ష్మణరావు ఉన్నారు.